# పెన్ పవర్


## తెలంగాణ రౌండప్

బుధవారం | 21 ఆగస్టు 2024 | పేజీలు 8




దొమ్మర పోచంపల్లి విలేజ్ కుడికుంట ఎఫ్‌టిఎల్ బఫర్‌లో అపార్ట్‌మెంట్ నిర్మాణం..

కుడికుంట అపార్ట్‌మెంట్ కింద ఊరు నాలా ఉన్నట్లు గూగుల్ చిత్రం..




# ఎఫ్‌టిఎల్ కోఆర్డినేట్స్..

# గోల్ మాల్

## నాలాలు చెరువులు మాయం కావడానికి ఇదే ప్రధాన కారణం..

- ఏళ్ళు గడుస్తున్నా కొద్దీ చెరువుల విస్తీర్ణం ఎలా తగ్గుతుంది..?
- నీళ్లు రావడం లేదంటూ చెరువుల విస్తీర్ణం కుదింపు..
- చెరువు భూములు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తారా..?
- ఎఫ్‌టిఎల్ కోఆర్డినేట్స్ మార్పు ఆధారంగా నిర్మాణ అనుమతులు మంజూరు..


-2లో





బహదూర్‌పల్లి ప్రైమార్క్ టవర్‌ల కింద నాలా కబ్జాపై రెవెన్యూ, ఇరిగేషన్ సర్వే.. ఫైల్ ఫోటో..

మాధవ్ పత్తి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 20:**

సాంకేతిక పరిజ్ఞానం మానవాళి మనుగడకు ఉపయోగపడాలే కానీ.. చెడు తలపెట్టకూడదని పలువురు హితవు బోధిస్తున్నారు.. చెరువు శిఖం భూములే లక్ష్యంగా అక్రమార్కులకు పట్టం కట్టేందుకు సంబంధిత అధికారులు ముందూ వెనుకా ఆలోచించకుండా విధులు నిర్వర్తిస్తున్నారు.. పట్టాభూములు ఉన్నప్పటికీ నిర్మాణాలు చేపట్టకూడదు.. చెరువు శిఖం భూములే లక్ష్యంగా 'రీ'సర్వేల పేరుతో "ఎఫ్.టి.ఎల్" కోఆర్డినేట్స్ తారుమారు చేసి చెరువులను కుదిస్తున్నారు.. ముఖ్యంగా బడా నేతల బంధువుల శిఖం భూములను కోఆర్డినేట్స్ మార్పులు చేసి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా "ఎన్‌ఓసి తో సహా క్లియర్ చేస్తున్నారు.. ఇప్పటివరకు కోఆర్డినేట్స్ మార్చిన చెరువులను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది.. కోఆర్డినేట్స్ మార్చిన ప్రతిచోట ఓ బడా నిర్మాణ సంస్థల వెంచర్లే దర్శనమిస్తున్నాయి.. హెచ్ఎండిఏ లేక్స్ ఆన్‌లైన్‌లో ఇప్పటికీ 2013 నాటి ఎఫ్.టి.ఎల్ కోఆర్డినేట్స్ ఉన్నాయి.. కానీ ఇరిగేషన్ శాఖ మాత్రం శిఖం భూములు ఎన్‌ఓసి లతో పట్టాదారులకి అనుకూలంగా తారుమారు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది..ఇది ఎఫ్.టి.ఎల్ కోఆర్డినేట్స్ తో శిఖం భూముల కుంభకోణంగా పలువురు ఆరోపిస్తున్నారు.. చట్టంలో కొద్దిపాటి లొసుగులు కనిపిస్తే చాలు, అక్రమార్కులకు సహకరించేందుకే అధికారులు మొగ్గు చూపుతున్నారు.. చెరువుల బౌండరీలు కుదించుకు పోవడంలో అధికారులే సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారని కొన్ని సంఘటనల ఆధారంగా స్పష్టమవుతుంది.. ఏళ్ళు గడిస్తే చెరువుల హద్దులు మారిపోతాయా..?ఎఫ్‌టిఎల్ బఫర్ స్థలాలను ప్రైవేటు వెంచర్‌లకు రాసిస్తారా..? ఉమ్మడి సర్వేలతో కబ్జాలను గుర్తిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, చర్యలు తీసుకోవడంలో జాప్యమెందుకు..? పత్రికా విలేఖరులు, ఫిర్యాదు దారులు ప్రశ్నిస్తే దాటవేసే ధోరణితో సమాధానం..! చేసేదేమీ లేక, కొందరు హైకోర్టును ఆశ్రయించిన వారు ఉన్నారు..

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

- కలెక్టర్‌లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు..
- ఖమ్మం నుండి వివిధ జిల్లాల కలెక్టర్‌లతో వీడియో సమీక్ష..




- భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్‌లు అప్రమత్తంగా ఉండాలి..
- విద్యా సంస్థల సెలవులపై కలెక్టర్‌లదే తుది నిర్ణయం..
- పదిరోజుల్లో ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి..
- 23, 24 తేదీల్లో నూతన "రెవెన్యూ" ముసాయిదాపై జిల్లాల్లో వర్క్ షాప్‌లు..
- ఎల్ఆర్ఎస్ పర్యవేక్షణకై ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్..


-3 లో


# కట్టు కాలువలు పునరుద్ధరించండి..

- నాలాలకు అడ్డంగా ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లు..
- ఎండిపోయిన నాలాలను ఆక్రమిస్తున్న భూ బకాసురులు..
- నాలాలను పునరుద్ధరించాలంటూ మల్లంపేట గ్రామస్థుల వినతి..


-4 లో




# ఎఫ్‌టిఎల్ కోఆర్డినేట్స్.. గోల్ మాల్..
















2023 జూన్ నెలలో బౌరంపేట్ పెద్ద చెరువు నాలాపై రెవెన్యూ, ఇరిగేషన్ ఉమ్మడి సర్వే..ఫైల్ ఫోటో




బౌరంపేట్ రామాజీకుంటలో హద్దులు మార్చి ఎన్ఓసి జారీచేసిన ఇరిగేషన్..

## కుడికుంట చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్‌లో అపార్ట్‌మెంట్..

దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి కుడికుంట లేక్ఐడి నెం.2834 చెరువు కబ్జాపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది.. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ స్థలంతో పాటు నాలాను కబ్జాచేసి సుమారు 800 గజాల్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణానికి..! నేతల సిఫార్సులు అధికారుల సమిష్టి సహకారం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. 2023 మే 26న అప్పటి తహశీల్దార్, నిర్మాణ అనుమతులు రద్దుచేయడానికి, దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌కి లేఖ రాశారు.. లేఖలో అపార్ట్‌మెంట్ నిర్మాణం ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో నిర్మిస్తున్నారని తహశీల్దార్ లేఖలో పేర్కొన్నారు.. తహశీల్దార్ లెటర్‌తో స్పందించిన మున్సిపల్ కమిషనర్ 2023 నవంబర్ 3న అనుమతులను రద్దు చేశారు.. పర్మిషన్ రద్దు నాటికి సదరు కుడికుంట అక్రమ నిర్మాణం "జీ౦2" అంతస్తులు మాత్రమే ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది.. అసతర్వాత "జీ౦5" అంతస్తులు ఎలా నిర్మించారు..? డిసెంబర్ 12, 13న కూల్చివేతలకు వెళ్ళిన సిబ్బంది పాక్షిక చర్యలతో వెను తిరగడానికి కారణం..? అక్రమార్కులు హైకోర్టు ఆర్డర్ తెచ్చుకోవడానికి "ఉదతభక్తిగా" అధికారుల సహకారమా..? 2024 జనవరి 2న స్టేటస్‌కో వచ్చిన తర్వాత అయినా..? పనులు ఎందుకు నిలిపి వేయలేదు..? రెండు అంతస్తుల్లో పనులు కొనసాగుతున్నా..! రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు విధుల్లో లేరా..? చెరువులో అక్రమ నిర్మాణానికి ఎంత మంది సహకరిస్తున్నారో "హైడ్రా" కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు..

- మొదటి పేజీ తరువాయి

మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని కొన్ని చెరువుల ఆక్రమణలపై, సర్వే నివేధికలు ఉన్నప్పటికీ చర్యలకు జాప్యం వహిస్తున్నారు.. కలెక్టర్‌కి నివేదిక పేరుతో సమాధానం చెబుతూ దాటవేసే ధోరణితో సంవత్సరం నుండి చర్యలు పెండింగ్‌లో పెడుతున్నారు.. ఏ మేరకు అధికారుల సహకారం ఉందో చెరువుల కబ్జాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి.. నేటి ఈ స్పెషల్ స్టోరీలో దుండిగల్ మండలానికి చెందిన 4 చెరువుల ఆక్రమణలపై..! పెన్ పవర్ దినపత్రిక వివరణాత్మకంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళేందుకు ఈ ప్రయత్నం.. దొమ్మర పోచంపల్లి గ్రామం కుడికుంట లేక్ఐడి నెం.2834 చెరువు..! బహదూర్‌పల్లి బొబ్బాఖాన్ చెరువు లేక్ఐడి నెం.2859.. బౌరంపేట్ పెద్దచెరువు లేక్ఐడి నెం.2829..

బౌరంపేట్ రామాజీకుంట లేక్ఐడి నెం.2824 చెరువులు అధికారుల కనుసన్నల్లోనే కబ్జాలకు గురవుతున్నాయని అనడానికి ఆధారాలను "హైడ్రా" కమిషనర్ రంగనాథ్ ఐపీఎస్ పరిశీలించి, చెరువులు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు..

## బౌరంపేట్ రామాజీకుంటలో కట్టడాలకు ఇరిగేషన్ ఎన్ఓసి కీలకం..

దుండిగల్ మండలం బౌరంపేట్ గ్రామ పరిధిలోని రామాజీకుంట లేక్ఐడి నెం.2824 చెరువు కబ్జాలో అధికారుల చేతివాటం స్పష్టంగా తెలుస్తుందని గతంలో బీజేపీ నేతలు పత్రికా సమావేశంలో పెర్కొన్నది తెలిసిందే.. ఆతర్వాత నీటిపారుదల శాఖ నుండి ఇచ్చిన ఎన్ఓసి, చెరువు కబ్జాకు కీలకంగా మారింది.. ఓవైపు క్రీక్ స్కూల్ యాజమాన్యం కబ్జాలో ఉందని పలు మార్లు పత్రికల్లో వచ్చినా..? పట్టించుకోని అధికారులు, ఎన్ఓసి జారీచేసి సహకరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.. 2013 సెప్టెంబర్ 7న హెచ్ఎండిఏ లేక్స్ వెబ్‌సైట్‌లో ఉంచిన ఎఫ్‌టిఎల్ కోఆర్డినేట్స్‌ను..? మార్పులు చేసి శిఖం భూములు కట్టబెట్టారు.. చెరువులు కుదించడమే అధికారుల విధులా..? చెరువులు అంతరించి పోవడానికి సంబంధిత అధికారులే సూత్రదారులుగా వ్యవహరిస్తున్నారు అనడంలో సందేహం ఏముంది..? చట్టంలో సవాలక్ష లొసుగులు ఉండవచ్చేమో కానీ..! చెరువుల కుదింపుకు ఏ కారణం చూపెడతారు..? అక్రమార్కులు కోర్టులను ఆశ్రయిస్తే కౌంటర్ దాఖలు చేసి రక్షించాల్సిన అధికారులు..! అక్రమార్కుల నోట్లకట్టలతో నోళ్ళు మూయించి, మరో బెంగుళూరు తరహాలో హైదరాబాదుకు నీటి సంక్షోభం ఏర్పడక ముందే.. ! ప్రజలను ఆదుకునేందుకు అన్నట్లు "హైడ్రా" రంగంలోకి దిగిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు..

## చెరువు నాలాపై ప్రైమార్క్ హైరైజ్ టవర్లు..

బహదూర్‌పల్లి బొబ్బాఖాన్ లేక్ఐడి నెం.2859 చెరువు నాలాను పూడ్చేసి ప్రైమార్క్ హైరైజ్ టవర్లు నిర్మించినట్లు రెవెన్యూ, ఇరిగేషన్ సర్వేలో తేల్చిందే.. బహదూర్‌పల్లి సర్వే నెం.188, 189, 191, 210 మీదుగా ప్రవహిస్తున్న బొబ్బాఖాన్ చెరువు నాలా స్థలం 0.17 గుంటలు కబ్జాచేసి ప్రైమార్క్ హైరైజ్ టవర్లు నిర్మించినట్లు అధికారులు తేల్చిందే.. నాలా పూడ్చి వేసినట్లు నాలా ఫైల్ ఫోటోలతో స్పష్టతను ఇస్తుంది.. మరి సంబంధిత అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు..? ప్రైమార్క్ వెంచర్ నిర్వాహకులకు, ప్రారంభంలో దుండిగల్ మండల సర్వేయర్ నాలా చూపించకుండానే..! ఇచ్చిన సర్వే స్కెచ్‌మ్యాప్ హెచ్ఎండిఏ అనుమతులు లభించడానికి కీలకంగా మారడం మరో ప్రధాన అంశంగా చెప్పవచ్చు.. ప్రైమార్క్ టవర్ల కింద నాలా కబ్జా విషయంలో భారీగా ముడుపులు చేతులు మారాయని, అందుకే చర్యల్లేవని ఆరోపణలు వస్తున్నాయి..

## బౌరంపేట్ పెద్దచెరువు నాలాపై 12 డూప్లెక్స్‌లు..

దుండిగల్ మండలం బౌరంపేట్ పెద్ద చెరువు లేక్ఐడి నెం.2829 చెరువు కట్ట దిగువ భాగంలో "త్రిపుర ల్యాండ్‌మార్క్-2" వెంచర్ నిర్వాహకులు నాలాపై 12 డూప్లెక్స్ విల్లాల నిర్మాణాలు ఉన్నట్లు.. 2023 జూన్ నెలలో అప్పటి కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, ఇరిగేషన్ ఉమ్మడి సర్వేలో తేల్చారు.. సర్వే నెంబర్ 756లో 01-07 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, పెద్దచెరువు నాలా, 756 స్థలంలో ప్రవహిస్తున్న చెరువు నాలాపై ఖరీదైన 12 డూప్లెక్స్ నిర్మాణాలు చేపట్టారని ఉమ్మడి సర్వేలో తేల్చారు, కలెక్టర్‌కి నివేదిక పంపించినట్లు దుండిగల్ రెవెన్యూ అధికారులు పేర్కొన్నదే.. సుమారు 14 నెలలు గడిచినా నేటికీ చర్యల్లేవు.. పెద్దచెరువు తూము కాలువను "కాంక్రీట్‌తో" మూసేసి, "త్రిపుర ల్యాండ్‌మార్క్-2" నిర్వాహకులు విల్లాలు నిర్మించారు.. దీని వెనుక ఓ బీఆర్ఎస్ నేత ఉండటంతో సర్వేలో తేల్చిన 12 విల్లాలు, సర్వే ఊసేలేని పెద్దదిగా పెద్ద చెరువు తూము కాలువపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు..

- భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్‌లు అప్రమత్తంగా ఉండాలి..
- విద్యా సంస్థల సెలవులపై కలెక్టర్‌లదే తుది నిర్ణయం..
- పదిరోజుల్లో ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి..
- 23, 24 తేదీల్లో నూతన "రెవెన్యూ" ముసాయిదాపై జిల్లాల్లో వర్క్ షాప్‌లు..
- ఎల్‌ఆర్‌ఎస్ పర్యవేక్షణకై ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్..

ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి మంత్రి పొంగులేటి వీడియో సమీక్ష..





# అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

## కలెక్టర్‌లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు..

## ఖమ్మం నుండి వివిధ జిల్లాల కలెక్టర్‌లతో వీడియో సమీక్ష..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 20:** రాష్ట్రం లో విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యం లో,అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసం బంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదురుకోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, నూతన రెవెన్యూ చట్టం –2024 ముసాయిదా, ధరణి దరఖాస్తులు, ఎల్‌ఆర్‌ఎస్ తదితర అంశాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ శ్రీమతి శాంతి కుమారి, వివిధ జిల్లాల కలెక్టర్లతో మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఐదు రోజుల్లో వర్షాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు..




వీడియో సమీక్షలో సీఎస్ శాంతికుమారి..

### అదనపు సిబ్బందిని కేటాయించండి - మేడ్చల్ జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం మాట్లాడుతూ రెండు రోజులుగా జిల్లాలో 5 సెం .మీ వర్షం కురిసిందని, జిల్లాయంత్రాంగం ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకలుకండా అవసరమైన చర్యలు తీసుకున్నారని అన్నారు.. జిహెచ్ఎంసి పరిధిలో 13 మున్సిపాలిటీలలో భారీ వర్షం పడిందని వర్షం నీరు ఎక్కడా నిలువకుండా తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు... నూతన రెవెన్యూ చట్టం –2024 ముసాయిదా, ధరణి దరఖాస్తులు, ఎల్‌ఆర్‌ఎస్ తదితర అంశాలపై విధులు నిర్వహించడానికి డిప్యూటేషన్ పై ఉన్న సిబ్బందిని జిల్లాలో విధులు నిర్వహించడానికి కేటాయించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి(రెవెన్యూ), రాధిక గుప్తా (లోకల్‌బాడి) , డిఆర్ఓ హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు

### లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ చర్యలు..

గత రాత్రి నుంచి గ్రేటర్ హైదరాబాద్, నిజామాబాద్ పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినా..! వీలైనంత మేరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితిపై మంత్రి పొంగులేటి కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, జిల్లా కలెక్టర్‌లు అప్రమత్తంగా పర్య వేక్షించాలని సూచించారు.. ప్రభుత్వ విభాగాలతో కలిసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ విధమైన సహా యం కావాలన్న సిఎస్‌ను, తనను ఏ సమయంలో నైనా సంప్రదించవచ్చని మంత్రి అన్నారు..

### నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై.. మేధావులతో వర్క్‌షాప్..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురాబోతున్న నూతన రెవెన్యూ చట్టం 2024 పై ప్రజా అభిప్రాయ సేకరణలో భాగంగా ఈ నెల 23, 24 తేదీల్లో ఆయా జిల్లాల్లో స్థానిక పరిస్థితులను బట్టి నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై వివిధ రంగాల మేధావులతో వర్క్ షాప్ నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు.
ధరణి సమస్యలపై గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తులతో పాటు ఇటీవల కాలంలో కొత్తగా వచ్చిన దరఖాస్తులను వచ్చే పదిరోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలను తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో దరఖాస్తులు అధికసంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని, ఈ జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు.. లక్షాలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే లేఅవుట్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనల ప్రకారం మాత్రమే భూముల క్రమబద్ధీకరణ జరగాలని ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పకడ్బంధీగా చర్యలు తీసుకోవాలని, ఎల్‌ఆర్‌ఎస్ క్షేత్రస్థాయి తనిఖీల కోసం స్పెషల్ టీమ్‌లతో పాటు హెల్ప్ డెస్క్ లను కూడా ఏర్పాటు చేసుకోవాలని పలు సూచనలు చేశారు.

### ఎల్‌ఆర్‌ఎస్ పర్యవేక్షణకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నియామకం..

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌ను పర్యవేక్షణ అధికారిగా నియమించాలని సీఎస్ కు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో అవసరమైన మేరకు డాక్యుమెంట్లు ఇవ్వని పక్షంలో ఇప్పుడు తీసుకుని ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద మొదటి దశలో వంద ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఇందులో ఎదురయ్యే మంచి చెడులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో 2020 లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దాదాపు 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని గత నాలుగు సంవత్సరాలుగా ఈ దరఖాస్తులు ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదని దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు..



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్‌లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా..



మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లా అధికార యంత్రాంగం..

# కట్టు కాలువలు పునరుద్ధరించండి..





## నాలాలకు అడ్డంగా ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లు..
## ఎండిపోయిన నాలాలను ఆక్రమిస్తున్న భూ బకాసురులు..
## నాలాలను పునరుద్ధరించాలంటూ మల్లంపేట గ్రామస్థుల వినతి..

**దుండిగల్, పెన్ పవర్, ఆగస్టు 20:** ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా సర్వీస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా అలుగులు నాలాలను సైతం మూసివేయడంతో చెరువులకు వెళ్లే అలుగులు కాస్త మూసుకుపోయాయి. ఈ అలుగులు, నాలాల వద్ద పైపులు వేసి సర్వీసు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండగా. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పలు చోట్ల కట్టు కాలువలు మూసి వేయబడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల నుండి వచ్చే వరద నీరు చెరువుల్లోకి చేరకుండా ఎక్కడకక్కడే నిలిచిపోతున్నాయి.. ఇందులో భాగంగా మల్లంపేట కత్వచెరువుకు కూడా ఎగువ నుండి వచ్చే అలుగు మరియు నాలా ఔటర్ రింగ్ రోడ్ పక్కన సర్వీస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా వీటిని మూసివేశారని, ఐదు కిలోమీటర్ల నుండి కట్టు కాలువ నీళ్లు రింగ్ రోడ్ నుండి పక్క దారిలో వెళ్తున్నాయని మల్లంపేట గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై మంగళవారం దుండిగల్ ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా, చెరువుకు నీరు చేరే కాలువలకు సర్వీస్ రోడ్డుకు అడ్డంగా మట్టి ఉన్నందున నీళ్ళు పక్కకు వెళ్ళిపోతున్నాయని, వర్షపు నీరు కత్వచెరువులోకి చేరే మార్గం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.. కట్టుకాలువలు పునరుద్ధరించి తద్వారా నీళ్లు కత్వ చెరువులోకి వెళ్లే మార్గం చూపాలని కోరారు..




# భూ రికార్డుల సవరణలపై.. హైకోర్టు కీలక ఉత్తర్వులు..

## భూములకు సంబంధించిన రికార్డులను సవరించే అధికారాలు ఆర్డీవోకు లేవు:హైకోర్టు..

**హైదరాబాదు, పెన్ పవర్,ఆగష్టు 20:** భూ రికార్డుల సవరణపై హైకోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే.శ్రీనివాస్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని సర్వే నం.23, 24ల్లో 50 ఎకరాల భూములు తలాబ్ చెరువుకు చెందినవిగా పేర్కొంటూ 2015లో ఆర్డీవో జారీ చేసిన ప్రొసీడింగ్ చెల్లదని హైకోర్టు తీర్పు ఇచ్చింది.. గతంలో ఆర్డీవో జారీ చేసిన ప్రొసీడింగ్‌పై ఇరు వర్గాలు హైకోర్టును ఆశ్రయించారు.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె. శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.. ప్రజాప్రయోజన వ్యాజ్యం పిటిషనర్ తరపు న్యాయవాది 1954-55లో శిఖం వీటిపై జహీరాబాద్ ఆర్డీవో విచారణ చేపట్టి ఇది చెరువు భూమిగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఎమ్మార్వో అమలు చేయడంలేదన్నారు.. పట్టాదారుల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆర్డీవో భూములపై జారీ చేసిన ఉత్తర్వులు చట్టవిరుద్ధంగా ఉన్నాయని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వీటిని జారీ చేశారని పేర్కొన్నారు.. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం భూ రికార్డులు సవరించే అధికారం ఆర్డీవోకు లేదని తేల్చి చెప్పింది.. ఈ భూమిని తలాబ్ చెరువు భూమిగా పేర్కొన్న ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వులను, ఉన్నత న్యాయస్థానం రద్దు చేస్తున్నట్లు హైకోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది..

భూములను పట్టాదారులు, స్వాధీనంలో ఉన్నవారిపేర్లపై ఎంట్రీలను సవరించాలని ఆదేశించింది.అయితే ఈ భూములకు సంబంధించి కలెక్టర్ తాజాగా విచారణ చేపట్టవచ్చని పేర్కొంటూ పిటిషన్‌లపై విచారణను మూసివేసింది..



# సీజనల్ వ్యాధులు డెంగ్యూ మలేరియా నిర్మూలనకై ర్యాలీ..

## ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ..






**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్ ,ఆగస్టు 20**ప్రపంచ దోమల దినోత్సవంని పునస్కరించుకొని జీహెచ్ యంసీ యల్ బి నగర్ జోన్ కాప్రా సర్కిల్ ఎంటమలాజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా కాప్రా సర్కిల్ కార్యాలయం నుండి రాదికా చౌరస్తా నుండి ఈసీఐఎల్ మీదుగా దోమ కాటు వ్యాధుల నివారణ పై అవగాహనా ర్యాలీని కాప్రా సర్కిల్ ఉప కమీషనర్ ముకుంద రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఎంటమాలజి ఎఈ డి. రమేష్ మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రాస్ అనే బ్రిటిష్ మిలిటరీ వైద్యుడు హైద్రాబాద్ లో గల బేగంపేట లో దోమల పై అనేక ప్రయోగాలు చేసి 1897లో ఆగస్ట్ 20వ తేదీన దోమల ద్వార మలేరియా వ్యాధి మనుషులకు వ్యాపిస్తుందిని తనప్రయోగాల ద్వార ప్రపంచానికి తెలియజేశారు. ప్రయోగాలతో నోబెల్ బహుమతి కూడా లభించింది. అందువల్ల ఈ రోజును ప్రతియేట ప్రపంచ దోమల దినోత్సవంగా ప్రపంచం అంతా నిర్వహించుకుంటారని ఏఈ రమేష్ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం శానిటేషన్ విభాగం సిబ్బందిచే దోమలు అభివృద్ధి చెందుటకు అనుకూల పరిస్థితులు వాటి అభివృద్ధి నిరోధించుటకు కావలసిన చర్యలు,దోమల వలన వ్యాపించే వ్యాధులు, దోమకాటు భారీ నుండి రక్షించుకోవడానికి తీసుకోవలసిన చర్యలు, ఇంటి పరిసరాలలో వర్షపు నీరు లేదా ఇతర నీరు నిలవకుండా టైర్లు,పగిలిన కుండలు,పగిలిన బకెట్లు, కొబ్బరి చిప్పలు,లాంటి వాటిలో వర్షపు నీరు నిలిచే ప్రమాదం ఉంది కావున రెండు మూడు రోజులకు ఒకసారి నీటిని తొలగిస్తూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించవలసినదిగా దోమతెరలు వాడవలసినదిగా కిటికీలకు డోర్లకు మెష్ ఏర్పాటు చేసుకొని దోమల బారిన పడకుండా తద్వారా మలేరియా,డెంగ్యూ, లాంటి ప్రాణాంతక విష జ్వరాల బారిన పడకుండా సీజనల్ డిసీజెస్ బారిన పడకుండా మనల్ని మనము కాపాడుకోవలసిందిగా ఈ విషయాన్ని ఇరుగుపొరుగు వారికి స్నేహితులకు కూడా తెలియజేయవలసిందిగా ఎంటమాలజి ఎఈ రమేశ్ సూచించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున,డిపిఓ దామోదర్ రెడ్డి,ఎంటమాలజీ విభాగం సానిటరీ సూపర్ వైజర్ లు సుదర్శన్,ఎంటమాలజీ సూపర్ వైజర్ లు కనకయ్య, నరేందర్ రెడ్డి,నర్సింహా గౌడ్
ఈ.ఎఫ్.ఏ అనిల్ మరియూ ఎంటమాలజి సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# లోతట్టు ప్రాంతాల్లో చైర్మన్ పర్యటన



**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ ఆగస్టు 20:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి ఎక్స్ రోడ్, బిఎంఆర్ ఎన్క్లేవ్, రాంపల్లి చర్లపల్లి రోడ్డు, శిల్ప నగర్, సాయి సంజీవని నగర్, బిబిసి కాలనీ ప్రాంతాల్లో చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మంగళవారం కమిషనర్ రాజేంద్ర కుమార్ తో కలిసి

పర్యటించారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మున్సిపాలిటీలోని పలు కాలనీలు నీట మునగడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్బంగా చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ లోని పలు వార్డులలో నిలిచిపోయిన వరద నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో 9640010053 నెంబర్ కు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పంగ హరిబాబు, సుర్వి శ్రీనివాస్ గౌడ్, అన్నంరాజు సుమిత్ర, మున్సిపల్ మేనేజర్ కె చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పదవి అవసరం లేదు... రేవంత్ వెంట ఉంటా: మోత్కుపల్లి నర్సింహులు



**పెన్ పవర్ ఆగస్టు 20:** ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేతులెత్తి ధన్యవాదాలు తెలుపుతున్నానని సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఆగస్ట్ 1 నాడు మాదిగలకు, మాదిగ ఉపకులాలకు స్వాతంత్ర్యం వచ్చిందని రేవంత్ చెప్పారని తెలిపారు. తనకు ఎన్నికల్లో సీట్ రాలేదని మొన్నటి వరకు ఎంతో బాధ ఉండేదని... కానీ ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత... ఆ విషయాన్ని అసెంబ్లీలో సీఎం ప్రకటించిన తర్వాత ఎంతో ఆనందపడ్డానని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రకటన మాదిగ జాతి మొత్తానికి ధైర్యాన్ని ఇచ్చిందని మోత్కుపల్లి అన్నారు. జాతి మొత్తం రేవంత్ వెంట ఉందని... ఆయనకు తాము అన్ని విధాలుగా రుణపడి ఉంటామన్నారు. రేవంత్ శాశ్వతంగా ముఖ్యమంత్రిగా ఉండొచ్చని చెప్పారు. దేశానికే ఆదర్శవంతమైన సీఎంగా రేవంత్ నిలుస్తారని అన్నారు. మంద కృష్ణ మాదిగను కూడా రేవంత్ కు అండగా తీసుకొస్తామని చెప్పారు. తనకు ఎలాంటి పదవి అవసరం లేదని... ఒక కార్యకర్తగా ముఖ్యమంత్రి వెనుక ఉంటూ పని చేస్తానని తెలిపారు. రిజర్వేషన్లపై రేవంత్ ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ తీసుకురావాలని మోత్కుపల్లి కోరారు. 80 లక్షల మంది మాదిగలను హైదరాబాద్ కు తీసుకొచ్చి సభ పెడతామని చెప్పారు. మాదిగ జాతికి సీఎం రేవంత్ పెద్ద మాదిగ అన్నారు.

# వేలల్లో లాభాలు చూపించి... లక్షల్లో దోచేశారు




**హైదరాబాద్, ఆగస్టు 20:** హైదరాబాదులో పనిచేస్తున్న ఒక ఈఎన్‌టీ సర్జన్ అక్షరాల 8.5 లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. ఒక ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్ కేసులో ఇరుక్కున్న డాక్టర్ తాను మోసపోయానని గ్రహించి చివరకు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఫేస్?బుక్ ద్వారా ట్రేడింగ్ ప్రకటన చూసి మోసపోయిన డాక్టర్ పలు దఫాలుగా 8.50 లక్షల రూపాయలను చెల్లించాడు.మూడు నెలల క్రితం ఫేస్?బుక్ ట్రేడింగ్ యాప్ ప్రకటన చూసిన డాక్టర్ వాళ్ళ ఫోన్ నెంబర్లను సంప్రదించాడు. ఒక యాప్ ద్వారా పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు. స్టార్ట్ బ్రోకింగ్?పై సలహాలు సూచనలు ఇస్తామంటూ నమ్మించి ఎనిమిది కోట్ల రూపాయలు కాజేశారు. కూకట్?పల్లిలో ఈఎన్?టీ వైద్యుడిగా బాధితుడు పనిచేస్తున్నాడు. ఈ ఏడాది మే నెలలో ఫేస్?బుక్ యాడ్ చూసి కొన్ని ఫోన్ నెంబర్లను సంప్రదించటంతో ఒక నాలుగు కంపెనీల నుండి అతడికి కాల్స్ వచ్చాయి.జెపి మోర్గాన్, గోల్డ్ మాన్ కంపెనీ, మాన్ గ్రూప్,, యుఎస్బి సెక్యూరిటీస్ కంపెనీ పేర్లు చెప్పి బాధితుడికి పలువురు ఫోన్ చేశారు. ఈ సంస్థలకు సంబంధించిన ప్రతినిధిగా వాళ్లు పరిచయం చేసుకున్నారు. స్టాక్ బ్రోకింగ్?లో తమవి పెద్ద కంపెనీలు అని నమ్మించి.. తాము చెప్పింది చేస్తే స్టాక్ బ్రోకింగ్?లో ఎక్కువ లాభాలు తెప్పిస్తామని నమ్మించారు. బాధితుడికి అనుమానం కలిగి ఆర్బీఐ రెగ్యులేటరీ కింద జారీ చేసిన పత్రాలను చూపించాల్సిందిగా కోరాడు. వీటితోపాటు ఔఇ, బాఇ కు సంబంధించిన పత్రాలను చూపించాల్సిందిగా కోరాడు.బాధితుడు కోరినప్పటికీ పొంతనలేని సమాధానాలు చెబుతూ అలాంటి డాక్యుమెంట్స్ అత్యంత రహస్యంగా ఉంచుతామని అవి బహిర్గతం చేయలేమని బాధితుడిని నమ్మించారు. ఆ తర్వాత వీరు సూచించిన ఆప్?లను డౌన్లోడ్ చేసుకోవాల్సిందిగా బాధితుడుని మభ్య పెట్టారు. అందులో మాత్రమే స్టాక్ బ్రోకింగ్ చేయాలని సూచించారు. నిందితులు చెప్పిన విధంగా డాక్టర్ మొదట చిన్న నగదును పెట్టుబడిగా పెట్టారు. కొన్ని రోజులపాటు నగదు విత్ డ్రా చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఆ తర్వాత భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు. అందులోనూ లాభాలు వచ్చాయి. వచ్చిన లాభాలను విత్ డ్రా చేసుకోవాలని చూస్తే యాప్ దానిని రిస్ట్రిక్ట్ చేస్తుంది.మే నుంచి ఇప్పటి వరకూ దాదాపు ఎనిమిదన్నర లక్షల వరకు ఇన్వెస్టు చేశాడు. రిటర్న్లు కనిపించడంతో తిరిగి విత్ డ్రా చేసుకునేందుకు ప్రయత్నించాడు. కానీ ఈసారి డబ్బు రాలేదు. ఇదేంటని తనతో ఇన్వెస్టు చేయించిన బ్రోకర్లని అడగ్గా ఆ ఫీజు, ఈ ఫీజు కట్టాలి ముందు కడితేనే డబ్బులు వస్తాయి అని చెప్పారు.ఇదేదో కిరికిరి అని అతనికి అర్థమైంది. ఈలోపు డబ్బు కట్టాల్సిందేనని సదరు బ్రోకర్లు టార్చర్ చేయడం మొదలు పెట్టారు. పెట్టిన డబ్బు ఇరుక్కోవడమే కాకుండా పై నుంచి వీరి వేధింపులు ఎక్కువ అవ్వడంతో మోసపోయానని తెలుసుకున్న వైద్యుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు దీనిపై విచారణ చేస్తున్నారు.తనకు వచ్చిన లాభాలు విత్ డ్రా చేసుకోవాలని నిందితులను అడిగితే, తమకు ఇవ్వాల్సిన 20శాతం ప్రాఫిట్?తో పాటు 30శాతం టాక్స్ చెల్లిస్తే విత్ డ్రా వెసులు బాటు కల్పిస్తామని మభ్య పెట్టారు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. డాక్టర్ నగదు ట్రాన్స్?ఫర్ చేసిన లావాదేవీల వివరాలను పరిశీలిస్తున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

# తెలంగాణలోనూ.. బుల్డోజర్ పాలిటిక్స్



**హైదరాబాద్, ఆగస్టు 20:** ఉత్తర ప్రదేశ్ లో అన్యాయాలకు పాల్పడిన వారిపై, అక్రమాలు చేసిన వారిపై, ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి బుల్డోజర్ ప్రయోగించారు. బుల్డోజర్ బాబాగా ప్రసిద్ధి చెందారు. యోగి మార్క్ బుల్డోజర్ న్యాయం పై కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. తీవ్రంగా దుయ్య బట్టింది. కానీ ఇప్పుడు అదే మార్క్ విధానాన్ని కాంగ్రెస్ పార్టీ అమలు చేయాల్సి వస్తోంది.వెనుకటి రోజుల్లో అయితే ప్రభుత్వ భూములను ఆక్రమించాలంటే భయపడేవారు. ఎదుటివారి ఆస్తులను తమ పేరు మీద అక్రమంగా బదిలీ చేయించుకోవాలంటే వణికే వారు. చివరికి చెరువుల వైపు కన్నెత్తి చూసేవారు కాదు. నాలాల వైపు చూపు కూడా తిప్పే వారు కాదు. కానీ ఇప్పుడు అలా లేదు.. అక్రమాలు పెరిగిపోయాయి. అన్యాయాలు సర్వసాధారణమయ్యాయి. ఆక్రమణలు నిత్య కృత్యమయ్యాయి. చెరువులు, కుంటలు, నాలాలు, పక్క వాడి స్థలాలు.. ఇలా అన్ని అన్యాక్రాంతమవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఈ అక్రమాలు తారస్థాయికి చేరాయి. దీంతో వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. చెరువులు ఆక్రమణకు గురి కావడంతో వరద నీరు వెళ్లేదారి లేక హైదరాబాద్ నగరం మొత్తం చిన్నపాటి ద్వీపకల్పాన్ని తలపిస్తోంది.ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కఠిన చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ ఆధ్వర్యంలో హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. హైడ్రా అంటే హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అండ్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ. ఇప్పటివరకు హైదరాబాదులో హైడ్రా ఆధ్వర్యంలో దాదాపు 70 భవనాలను పూర్తిగా నేలమట్టం చేశారు. శ్రీమంతులు ఎక్కువగా సంచరించే ఓ ఆర్ ఓ, ఎస్వోఎస్ స్పోర్ట్స్ విలేజ్ లోని 12కి పైగా కట్టడాలతో పాటు 50 భవనాలను నేలమట్టం చేశారు. అంతేకాదు ఎఫ్టీఎల్ పరిధిలో ఒక సంస్థ భారీ వెంచర్ వేస్తే.. అందులో ఫ్లాట్లను కొంతమంది కొనుగోలు చేశారు. వాటిల్లో నిర్మాణాలు చేపట్టారు. వాటిని కూడా హైడ్రా అధికారులు కూల్చేశారు.మొయినాబాద్ మండలం అప్పాజిగూడ, చిలుకూరు, గండిపేట మండలం ఖానాపూర్ గ్రామాల్లో అప్పటి భారత రాష్ట్ర సమితి సర్పంచ్ లు భూములు కేటాయిస్తూ అనుమతి పత్రాలు ఇచ్చారు. అయితే ఆ సర్పంచ్ లు 2009 నాటి తేదీలతో వాటిని జారీ చేశారు. అందులో కొంతమంది నిర్మాణాలు చేపట్టారు. అయితే ఆ సర్పంచ్ లు ఇచ్చిన పత్రాలు మొత్తం నకిలీవని తేల్చిన హైడ్రా అధికారులు.. ఆ నిర్మాణాలను పడగొట్టారు. గండిపేట చెరువులో చేపట్టిన నిర్మాణాలను కూడా పడగొట్టారు. ఈ ప్రాంతంలో మాజీ మంత్రులకు, ఇతర రాజకీయ నాయకులకు భారీ భవనాలు ఉన్నాయని హైడ్రా అధికారులు గుర్తించారు. హిమాయత్ సాగర్ లోనూ ఇదే స్థాయిలో నిర్మాణాలు ఉన్నట్టు గుర్తించిన హైడ్రా అధికారులు.. వాటిని కూడా పడగొట్టే పనిలో ఉన్నారు. మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉన్న నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో ఖానాపురం పోచమ్మ ఆలయం వద్ద చేపట్టిన హోటల్ నిర్మాణాన్ని కూల్చేశారు. ఖానాపూర్ చెరువు శివారులో ఐదు ఎకరాల ఓఆర్వో స్పోర్ట్స్ విలేజ్ లో చేపట్టిన నిర్మాణాలను పడగొట్టారు. అయితే ఈ నిర్మాణాలను సుమారు 12 సంవత్సరాల క్రితం చేపట్టారు. ఇందులో ఫంక్షన్ హాల్, పిల్లల గేమ్ జోన్ ఉన్నాయి.

**70 భవనాలు కూల్చివేత :**

హైదరాబాద్ లో అక్రమ కట్టడాలపై హైడ్రా ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇప్పటివరకు 70 భవనాలతో పాటు పలు ప్రాంతాల్లో ప్రహరీ గోడలు కూల్చివేశారు హైడ్రా అధికారులు. నిన్న గండిపేటలోని ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. ఒక్క గండిపేటలోనే 20కి పైగా భవనాలను కూల్చేశారు. చందానగర్ సర్కిల్ మదీనాగూడ చెరువులో 3, బాచుపల్లిలోని ఎర్రకుంటలో 3, గాజులరామారంలో 42 భవనాలను నేలమట్టం చేశారు. చెరువులను పరిరక్షించడమే తొలి ప్రాధాన్యతగా తీసుకున్నారు అధికారులు.

# ఆ ఊరంతా సత్యహరిశ్చంద్రులే

**కరీంనగర్, ఆగస్టు 20:** అబద్ధం.. ఈ పదం అంటే ఒకప్పుడు కష్టంగా భావించే వారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అబద్ధమే అందరికీ అవసరం. తమ అవసరాలు తీరాలంటే.. అబద్ధం ఆడాల్సిందే. సందర్భానుసారమైనా.. వ్యక్తిగత అవసరాల కోసమైనా.. కుటుంబ అవసరాల కోసమైనా అబద్ధం ఆడాల్సిందే. అబద్ధం ఆడని రోజు అనేది ఈ రోజుల్లో లేదు. ప్రతి ఒక్కరూ.. ప్రతీరోజు అబద్ధం ఆడకుండా ఉండలేని పరిస్థితి నెలకొంది. ఆపదలో? ప్రాణాపాయం ఉన్నప్పుడు అబద్ధం ఆడడం తప్పు కాదని చట్టం కూడా చెబుతుంది. కానీ అబద్ధమే జీవితంగా బతకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మారుతున్న కాలం.. మారుతున్న పరిస్థితులు.. మారుతున్న అవసరాలు.. కూడా మనల్ని అబద్ధం ఆడేలా చేస్తున్నాయి. కానీ ఈ రోజుల్లో కూడా అబద్ధం ఆడకుండా ఉంది ఆ గ్రామం.. నిజమే. ఒకరో ఇద్దరో అబద్ధాలు ఆడకపోవడం కాదు.. ఊరు ఊరంతా అబద్ధాలు ఆడదు. అంతా సత్య హరిచంద్రులే. ఎవరూ ఆ ఊరిలో అబద్ధం ఆడరు. అందుకే ఆ ఊరి పేరే నిజాయితీ గూడెంగా మారింది. తెలంగాణ అంటేనే కలలకు ప్రసిద్ధి.. ఈ తెలంగాణను కుతుబ్‌షాహీల అజం జాహీలు, నిజాం ప్రభువులు కాకతీయులు పరిపాలించారు. వారి పలనలో ఎవరైతే సమాంతరాజులు ఉంటారో వారి పేర్ల మీదగా కొన్ని జిల్లాల పేర్లు గ్రామాల పేర్లు కూడా వెలిశాయి..



ఇందులోనే భాగంగా తెలంగాణ కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలంలోని నిజాయితీ గూడెం అనే గ్రామం ఉంది. ఊరుకు చుట్టుపక్కల పచ్చని పొలాలు,నాణ్యమైన రోడ్లు, తాగునీరు, సాగునీరు పుష్కలంగా ఉండడంతో భూమికి పచ్చని రంగు వేసినట్టు ఊరంతా పచ్చగా కళకళలాడుతుంది. ఈ గ్రామాన్ని అప్పుడు నిజాం ప్రభు పరిపాలించే వారు. ఈ ఊరు గ్రామస్తులు అందరూ అప్పుడు నిజాయితీగా ఉండేవారట. అందుకే ఈ గ్రామం పేరు నిజాయితీ గూడెం అని పేరు పెట్టారని గ్రామస్తులు అంటారు. ఈ ఊరి పొరుగు గ్రామాల పేర్లు కూడా ఖాదరగూడెం, వంకాయ గూడెం, అని పేర్లు ఉన్నాయి.ఈ గ్రామ ప్రజలు నాడు అబద్ధాలు ఆడకపోవడం ఒక విశేషం అయితే.. అప్పులు కట్టడంలోనూ నిజాయితీగానే ఉండేవారట. అలా కూడా ఈ ఊరికి నిజాయితీ గూడెం అని పేరు పెట్టారని స్థానికులు చెబుతారు. ఒక బ్రాహ్మణుడు చెప్పిన కథ ప్రకారం ఒక మహిళ స్నానం చేసేందుకు వెళ్లినప్పుడు ఆమె పుస్తెల తాడు తీసి ఒక మేకుకు తగిలించి వెళ్లి వచ్చేలోపు ఆ పుస్తెలతాడు మొత్తం చెదలు పట్టిపోయిందట అలా ఊరికి అప్పటి నుంచి ఊరికి ఎలాంటి అంటువ్యాధులు రావు. అలాగే ఊళ్లో రాళ్ల వర్షం కూడా పడదని శాస్త్రాలు చెప్పాయిని గ్రామ కుల పెద్ద చెబుతున్నారు.. ఇలా గ్రామానికి అన్ని రకాలుగా మేలు జరగడంతో నిజాయితీ గూడెంగా పెరుగంచింది.ఇక ఈ గ్రామంలో ఎవరి పని వారు చేసుకుంటారు. ఇప్పటికీ గ్రామంలో చాలా మంది నిజాయితీగా పని చేసుకుంటూ పోతారట. ఇప్పటి తరం వాళ్లు కూడా మద్యం మత్తు కూడా చాలా దూరంగా ఉంటారు. ఎవరో కొందరు మాత్రమే మద్యం తీసుకుంటారు తప్ప చాలామంది మద్యానికి దూరంగా ఉంటున్నారు.. అలాగే ఊరుకు చుట్టుపక్కల పచ్చని పొలాలు, నాణ్యమైన రోడ్లు, తాగునీరు, సాగునీరు పుష్కలంగా ఉండడంతో భూమికి పచ్చని రంగు వేసినట్టు ఊరంతా పచ్చగా కళకళలాడుతుంది.. ఊరిలో కూడా చాలామంది ఎక్కువ చదువుకున్న వాళ్లే ఉండడం విశేషం.. అలాగే ఇంకా కొంతమంది వ్యవసాయం ఇతర పనులు చేసుకుంటూ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు.

# ఊడిపోతున్న ఆర్టీసీ బస్సుల భాగాలు..

**నిజామాబాద్, ఆగస్టు 20:** ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. బస్సు ఎక్కగానే మనకు పెద్ద పెద్ద అక్షరాలతో ఈ కొటేషన్ కనిపిస్తుంది. కానీ.. ఇటీవల జరుగుతున్న ఘటనలతో దీనిపై సెటైర్లు పేలుతున్నాయి. తాజాగా.. ఆర్టీసీ బస్సు రన్నింగ్‌లో ఉండగానే బస్సు పార్టులు కిందపడ్డాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.టీజీఎస్ ఆర్టీసీకి చెందిన బస్సులకు సంబంధించి తరుచూ ఏదో ఒక ఘటన జరుగుతోంది. ఇటీవల బస్సు వెనక ఉండే రెండు చక్రాలు ఊడిపోయన ఘటన మరువకముందే.. మరో ఘటన జరిగింది. తాజాగా బస్సు రన్నింగ్‌లో ఉండగానే పార్టులు ఊడిపోయి రోడ్డుపై పడ్డాయి. నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. టీ జీ 31 జె 0054 బస్సు రన్నింగ్‌లో ఉండగా బస్సు పార్టులు ఊడిపోయి రోడ్డుపైన పడ్డాయి. పెద్ద శబ్దం రావడంతో.. బస్సులో ఉన్న ప్రయాణికులు, రోడ్డుపై ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన లో ఎవ్వరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కింద పడిపోయిన పార్టులను బస్ డ్రైవర్, కండక్టర్ తీసుకొని మళ్లీ ప్రయాణం మొదలు పెట్టారు. అయితే.. ఏ పార్ట్ ఊడిపోయింది.. బస్సుకు ఏమైందనే వివరాలను డ్రైవర్ గానీ.. కండక్టర్ గానీ చెప్పలేదు..ఇటీవల కూడా ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. నిర్మల్ డిపోకు చెందిన బస్.. జగిత్యాల నుంచి వెళుతుండగా మొరపెల్లి వద్ద ప్రమాదం జరిగింది. 50 మంది ఎక్కాల్సిన ఆ బస్సులో 170 మంది ఎక్కారు. ఓవర్ లోడ్ కారణంగా బస్సు వెనకాల రెండు టైర్లు ఊడిపోయాయని చెబుతున్నారు. ప్రమాదం సమయంలో బస్సులో ఎక్కువ మంది మహిళలు పిల్లలే ఉన్నారు. ఆ ఘటన మరువక ముందే ఉట్కూరు ఘటన జరిగింది. దీంతో ఆర్టీసీపై సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. ఆర్టీసీ బస్సులో ప్రయాణంపై నెటిజన్లు వ్యంగంగా స్పందిస్తున్నారు.ఇటీవల వరంగల్ జిల్లాలో బస్సు ప్రమాదం జరిగింది. ఓ ఆర్టీసీ బస్సు ఇద్దరిని బలి తీసుకుంది. కుమారుడి పెళ్లి కార్డులు పంచేందుకు అన్న కొడుకుతో కలిసి వెళ్లిన వరుడి తండ్రిని.. అతని సోదరిని కుమారుడిని



బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కోనాయిమాకుల వద్ద జరిగింది. వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఆర్టీసీ బస్సుల ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇలా వరుస ఘటనలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. రద్దీకి తగ్గట్టు బస్సులు ఏర్పాటు చేస్తే.. అంత మంది ఒకే బస్సులో ఎందుకు ఎక్కుతారని ప్రశ్నించారు.ఆర్టీసీ డ్రైవర్లపై ఒత్తిడి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఆర్టీసీ డ్రైవర్ 8 గంటలు డ్యూటీ చేయాలి. కానీ.. డ్రైవర్ల కొరత కారణంగా ఒక్కొక్కరు దాదాపు 14 గంటలు పనిచేస్తున్నామని డ్రైవర్లు వాపోతున్నారు. ఎక్కువ సమయం డ్యూటీ చేసినందుకు ప్రోత్సాహకాలు ఇస్తున్నా.. శారీరకంగా, మానసికంగా అలసిపోతున్నామని చెబుతున్నారు. ఇటు ఆర్టీసీలో డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయడం లేదని యూనియన్ నాయకులు చెబుతున్నారు. దాదాపు 600 వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయని సమాచారం. వీటిని భర్తీ చేస్తే.. డ్రైవర్లపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది.

## ప్రాంతీయ పార్టీలపై గులాబీ అధ్యయనం

**హైదరాబాద్, ఆగస్టు 20:** పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం డీఎంకే బాటలో నడవాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ సీనియర్ నేతల బృందం.. వచ్చే నెలలో చెన్నై పర్యటించనుంది. బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు పర్యటన చేయాలని గులాబీ నేతలు నిర్ణయించారు. పార్టీని మరింత పటిష్ఠం చేయడం కోసం అనుసరించాల్సిన మార్గాలను అన్వేషిస్తోంది. దేశ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రాంతీయ పార్టీల పనితీరును పరిశీలిస్తోంది.దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న (డీఎంకే) ద్రవిడ మున్నేట్ర కజగం నిర్మాణం, పనితీరుపై బీఆర్ఎస్ ఫోకస్ పెట్టింది. తమిళనాడుకు చెందిన డీఎంకే తరహాలోనే బీఆర్ఎస్ కూడా ఉద్యమ పార్టీ కావడంతో.. ఆ పార్టీపై అధ్యయనం చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన డీఎంకే.. ఎదురైన ఆటుపోట్లను ఎలా అధిగమించిందనే అంశాన్ని అధ్యయనం చేయాలని బీఆర్ఎస్ భావిస్తోంది.దీనికోసం కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ సీనియర్ నేతల బృందం సెప్టెంబర్లో చెన్నైలో పర్యటించనుంది.తమిళనాడులో క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు డీఎంకే సంస్థాగత నిర్మాణం తోపాటు.. ఇతర అంశాలను వారం రోజుల పాటు ఈ బృందం అధ్యయనం చేయనుంది. పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నేతృత్వంలో ఆంజనేయ గౌడ్, తుంగ బాలు వంటి యువ నేతలు చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం.. అన్నా అరివాలయంను సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. వచ్చే నెలలో జరగబోయే పర్యటనలో కేటీఆర్ సహా.. సీనియర్ నేతలు పాల్గొననున్నారు.అధికారం కోల్పోయిన తర్వాత.. ఓటమికి గల కారణాలపై ఇప్పటికే ఓ అంచనాకు వచ్చిన కేసీఆర్.. పొరపాట్లను సరిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. అటు బీఆర్ఎస్ నేతలు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారు. కీలక నేతలు కేటీఆర్, హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల్లో తప్పులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా రైతు రుణ మాఫీపై బీఆర్ఎస్ గట్టిగా పోరాడుతోంది. రుణ మాఫీ కానీ రైతుల పక్షాన నిలుస్తోంది.బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు ఆ పార్టీకి మద్దతు ఇస్తున్నారు. కానీ.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని విధంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఫలితాలు వచ్చాయి. దీంతో మళ్లీ ఆ జిల్లాలపై పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. ఆ జిల్లాల్లో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.

# దసరా తర్వాతే విస్తరణ...?

**హైదరాబాద్, ఆగస్టు 20:** మంత్రి, పీసీసీ చీఫ్ పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు మరికొన్నాళ్లు వేచిచూడక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. కాంగ్రెస్ మార్క్ రాజకీయంతో పదవుల భర్తీ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఒక్క అడుగూ ముందుకు పడలేదని సమాచారం. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ నియామకంపై కొంత కాలంగా కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తున్నా పార్టీలో ఏకాభిప్రాయం కుదరక మళ్లీ మళ్లీ వాయిదా పడుతోంది. ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ సారి ఎలాగైనా అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ తేవాలని ప్రయత్నిస్తున్నా, సీనియర్ల మోకాలడ్డుతో మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ లభించలేదని తెలుస్తోంది. ప్రస్తుతం పీసీసీ చీఫ్‌తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతున్నారు. జూన్ 27తో పీసీసీ చీఫ్ పదవీకాలం ముగియడంతో కొత్త వారిని నియమించాలని భావించింది కాంగ్రెస్ అధిష్టానం. రకరకాల సమీకరణలపై సీనియర్లతో చర్చించింది.ఐతే ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వస్తోంది. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు పలువురు నేతలతో అధిష్టానం రెండుసార్లు చర్చించింది. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పేర్లు పరిశీలనకు వచ్చినా, ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మరోసారి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఎంపీగా బలరాం నాయక్, ఎమ్మెల్సీగా మహేశ్ కుమార్ గౌడ్





ఉండటంతో మధుయాష్కీ వైపే కొంత మొగ్గు ఉన్నప్పటికీ లైన్ మాత్రం క్లియర్ అవ్వడం లేదంటున్నారు.ఇక మంత్రివర్గ విస్తరణలో తమ అనుచరులకు పదవులు ఇప్పించుకోవాలని సీనియర్లు ప్రయత్నస్తుండటంతో ఆ ప్రక్రియ ముందుకు కదలడం లేదు. ఇటు మంత్రివర్గం, అటు పీసీసీ చీఫ్ నియామకంలో ఒకదానికొకటి లింకు పెట్టడంతో పదవుల భర్తీ నాన్‌స్టాప్ సీరియల్‌గా మారిపోయింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉండగా, దాదాపు 12 మంది పోటీ పడుతున్నారు. మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని జిల్లాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్ రావు, వివేక్ పోటీ పడుతున్నారు. వీరిలో ప్రేమ్‌సాగర్‌రావు పేరును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బలంగా సమర్థిస్తుంటే? వివేక్ వైపు సీయం రేవంత్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అటు వివేక్ సోదరుడు మాజీ మంత్రి వినోద్ కూడా తనవంతు ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. దీంతో ఆ జిల్లాలో ఎవరికి చోటు ఇవ్వాలనేది తేల్చుకోలేకపోతున్నారంటున్నారు. అదేవిధంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్‌రెడ్డి, మదన్మోహనరావు మధ్య పోటీ కనిపిస్తోంది. ఇద్దరూ ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారంటున్నారు. సుదర్శన్ రెడ్డి వైపు రేవంత్ మొగ్గు చూపుతుంటే?ఇతర సీనియర్ల సహకారం, ఢిల్లీ లాబీయింగ్ చేస్తున్నారట మదన్ మోహన్.ఇక రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పోటీ పడుతుంటే? హైదరాబాద్ కోటాపై దానం నాగేందర్ ఆశలు పెట్టుకున్నారు. ఇక మంత్రివర్గంలో బెర్తు కోసం తనకు హామీ ఇచ్చారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పట్టుబడుతుండగా, అదే జిల్లా నుంచి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎస్టీ సామాజిక వర్గం నుంచి బాలు నాయక్ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.మున్నూరు కాపు వర్గం నుంచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ? ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి శ్రీహరి ముదిరాజ్ మంత్రి పదవి ఆశిస్తున్నారు. బీసీ రజక కోటాలో రేవంత్ కు సన్నిహితుడైన వీర్లపల్లి శంకర్ తన పేరును పరిశీలించాలని కోరుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బి.ఆర్.ఎస్ ను ఎదుర్కొవాలంటే తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని మైనంపల్లి రోహిత్ కోరుతుండగా?. అక్కడ హరీశ్,

రఘునందన్ లాంటి వారికి చెక్ పెట్టేందుకు రోహిత్ సరైనోడేనని భావనలో సీఎం ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.సీఎం రేవంత్ రెడ్డి ఈసారి మంత్రివర్గంలో తనకు అనుకూలమైన వ్యక్తులను తీసుకునేందుకు ప్రయత్నిస్తుంటే.. చాపకింద నీరులా సీనియర్ నేతలు తమ సన్నిహితులకు బెర్త్ కోసం పట్టుబడుతున్నారని చెబుతున్నారు. దీంతో మంత్రివర్గం విషయంలో లెక్కలు ఏమాత్రం సరితూగడం లేదని సమాచారం. మంత్రివర్గ లెక్కలు కుదిరితే.. పీసీసీ అంశాన్ని తేల్చవచ్చని భావిస్తోన్న అధిష్టానం రెండింటినీ వాయిదా వేసినట్లు చెబుతున్నారు.దీంతో ముచ్చటగా మూడోసారి కూడా పీసీసీ, మంత్రివర్గ విస్తరణ అంశం వాయిదా పడినట్లేనంటున్నారు. ఇక రాష్ట్రంలో అగ్రనేతలు పర్యటన ఉన్నందున ఈ నెలలో పదవుల భర్తీ ఉండదని, రాజ్యసభ ఎన్నికల తర్వాత సెప్టెంబర్లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని తెలుస్తోంది. ఏదేమైనా సీనియర్ల పంచాయతీ మరోసారి ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లేసింది

# రుణమాఫీపై ఇంటింటి సర్వే...

**నల్గొండ, ఆగస్టు 20:** తెలంగాణ వ్యాప్తంగా అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. రుణమాఫీ మంటలు ఇంకా చెలరేగుతూనే ఉన్నాయి. వివిధ సాంకేతిక కారణాల వల్ల మూడు విడతల్లో పంట రుణం మాఫీ కాని రైతుల సంఖ్య అధికంగానే ఉంది. పంట రుణం మాఫీ కాలేదన్న ఆగ్రహంతో ఉన్న రైతులను సముదాయించేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. వ్యవసాయ శాఖ అధికారిక సమాచారం మేరకు.. తమకు పంటరుణం మాఫీ కాలేదని ఫిర్యాదు చేసి ప్రతీ రైతు ఇంటికి వెళ్లి వివరాలు సేకరించున్నారు. దీనికోసం వ్యవసాయ శాఖ ఇంటింటి సర్వే జరపనుంది.గతేడాది శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తన ఎన్నికల హామీల్లో రూ.2 లక్షల రుణ మాఫీని ప్రకటించింది. గత ఏడాది డిసెంబరులో కాంగ్రెస్ అధికారం చేపట్టాక, రుణమాఫీపై కీలక ప్రకటన చేసింది. 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీల మధ్య పంట రుణం తీసుకున్న రైతులు రుణమాఫీ స్కీమ్ కు అర్హులుగా నిబంధనలు పెట్టింది. రుణమాఫీని కూడా మూడు కేటగిరీలుగా విభజించింది. రూ.లక్ష, రూ.లక్షన్నర, రూ.2లక్షల చొప్పున మూడు విడతలగా రుణాలను మాఫీ చేసింది. అయితే, రైతుల రుణ మాఫీ పూర్తిగా జరగలేదు. వేలాది మంది రైతులు ఈ స్కీమ్ కు అర్హులు కాకుండా పోయారు. మూడు విడతల్లో రుణమాఫీ చేశామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ,



రుణమాఫీ జాబితాల్లో పేర్లు లేని రైతులు అటు బ్యాంకులకు, మరో వైపు మండల వ్యవసాయ కార్యాలయాలకు పోటెత్తారు.చిన్న చిన్న కారణాలు, బ్యాంకు ఖాతాల్లో తప్పిదాలు, ఆధార్, పట్టా పాసుపుస్తకాల్లో పేర్లలోని వ్యత్యాసాలు ఇలా కనీసం 34 రకాలైన అంశాలను కారణంగా చూపి రైతుల పేర్లను తిరస్కరించారు. బ్యాంకర్లు, లేదంటే వ్యవసాయ, రెవిన్యూ శాఖల్లో జరిగిన తప్పులకు తమన బాధ్యులు చేయడాన్ని రైతులు జీర్ణించుకోలేక పోయారు. మూడు విడత రుణమాఫీ ముగిసిందని, హామీని పూర్తిచేశామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో రుణమాఫీ జరగని రైతులంతా జిల్లాలా వారీగా రోడ్లెక్కడం మొదలు పెట్టారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని అర్హులైన రైతులకు కచ్చితంగా రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం రంగంలోకి దిగాల్సి వచ్చింది.రకరకాలైన కారణాలతో రుణాలు మాఫీ కాని రైతులను తమ సమస్యలను వివరిస్తూ ఇప్పటికే జిల్లా అధికారులకు, ముఖ్యంగా వ్యవసాయ శాఖకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ ఫిర్యాదులను పరిశీలించి అర్హులకు న్యాయం చేసేందుకు వ్యవసాయశాఖ మండల ఏఓలను నోడల్ అధికారులుగా నియమించింది. రుణ మాఫీ కానీ రైతులంతా తమ తమ మండల వ్యవసాయశాఖ అధికారులను కలిసి వివరాలు సమర్పించాలని కోరింది. ఇలా ఇప్పటికే ఒక్క నల్గొండ జిల్లాలోనే 13 వేల ఫిర్యాదుల అందినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు తమ ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలను సరిదిద్ది వారికి రుణమాఫీ వర్తించేలా చూసేందుకు వ్యవసాయ శాఖ ఇంటింటి సర్వే మొదలు పెట్టనుంది. ఈ వారంలోపే రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్ ను తయారు చేస్తోందని, యాప్ అందుబాటులోకి రాగానే ఇంటింటి సర్వే మొదలవుతుందని వ్యవసాయశాఖ వర్గాలు చెప్పాయి.

### ఆందోళనలపై మంత్రుల సమాధానం

తు రుణ మాఫీకి సంబంధించి అన్నదాతలు చేస్తున్న ఆందోళనలపై మంత్రులు స్పందించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుణ మాఫీకి సంబంధించి కీలక ప్రకటన చేశారు. ఆధార్ నంబర్ 12 ఉండాలి.. కానీ కొందరికి 11 మరికొందరికి 13 నంబర్లు ఉన్నాయి. అందుకే పూర్తిగా రుణమాఫీ చేయలేకపోయాము అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరించి అర్హులైన అందరికీ రుణ మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రుణమాఫీ మొత్తం చేయలేకపోయాం.. మిగిలిన రూ. 12 వేల కోట్ల రూపాయలు రాబోయే రోజుల్లో రైతుల ఖాతాల్లో వేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.ఇటు రైతుల ఆందోళనలు కొనసాగాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా రైతులు రుణ మాఫీ కోసం పోరాటం చేస్తున్నారు. అదిలాబాద్ జిల్లాలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. నిరసనలు, ఆందోళనలపై నిషేధం విధించారు. రుణమాఫీపై రైతులు చేస్తున్న ఆందోళనలు, శవ యాత్రలపై ప్రభుత్వం సీరియస్ అయినట్టు తెలుస్తోంది. దీంతో జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు డీఎస్పీ జీవన్ రెడ్డి.రైతుల ఆందోళనలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రుణమాఫీపై అయోమయానికి గురిచేస్తున్నారన్న బండి.. నిజంగా రుణమాఫీ చేస్తే రైతులు ఎందుకు రోడ్లపైకి వస్తున్నారని ప్రశ్నించారు. రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు.